గడువులోపు పూర్తయ్యేనా..?

- నత్తనడకన తాడికల్– ఏరడపల్లి డబుల్ రోడ్డు పనులు
- నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపణలు
- అధికారుల పర్యవేక్షణ కరువు


తాడికల్ - ఏరడపల్లి డబుల్ రోడ్డు పనుల్లో భాగంగా రహదారికి ఇరువైపులా వేసిన కంకర

శంకరపట్నం: మండలంలోని తాడికల్– ఏరడపల్లి జాతీయ రహదారి డబుల్‌రోడ్డు పనులు గడువులోపు పూర్తవుతాయో లేదోననే అనుమానం వాహనదారులు, ప్రయాణికుల్లో నెలకొంది. తాడికల్ నుంచి ఏరడపల్లి వరకు 8కి.మీ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.13 కోట్ల నిధులు మంజూరు చేసింది . పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌పై విమర్శలు వెలువడుతున్నాయి. కల్వర్టులు నిర్మించినా క్యూరింగ్ చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న సింగిల్ రోడ్డును జాతీయ రహదారుల సంస్థ పరిధిలోకి మార్చడంతో కేంద్రం నుంచి నిధులు మంజూరయ్యాయి. డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఇక్కట్లు తీరుతాయని, వాహనదారులు, ప్రయాణికులు భావించారు. కానీ పనులు నెమ్మదిగా సాగుతుండటంతో ఇంకెన్ని రోజులు బాధలు అనుభవించాలని వాపోతున్నారు.

• రోడ్డుకు ఇరువైపులా చెరువు మట్టి

రోడ్డుకు ఇరువైపుల చెరువుమట్టిని పోస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. రెవెన్యూ అధికారులకు సైతం ఓరైతు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. రోడ్డు పనులకు మట్టి తరలిస్తే గనులు, భూగర్భశాఖ అధికారుల అనుమతి తీసుకోవాలన్న నిబంధనలు ఉన్నాయి. ఈరోడ్డు పనులకు చెరువుమట్టిని తరలించడానికి అనుమతి తీసుకున్నారా లేదా అనే కోణంలో విచారణ చేయాల్సి ఉంది.

• ఫిబ్రవరిలోపు గడువు

2024 ఫిబ్రవరిలోపు తాడికల్–ఏరడపల్లి రోడ్డు పనులు పూర్తి చేయాలి. పదికాలాలపాటు రోడ్డు మన్నికగా ఉండటానికి పనులను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ప్రయాణికులు, వాహనదారుల కోరుతున్నారు.

పనులు పర్యవేక్షించాలి



డబుల్‌రోడ్డు పనులను అధికారులు పర్యవేక్షించాలి. కల్వర్టు నిర్మాణం చేసి క్యూరింగ్ చేయకపోవడంతో భవిష్యత్తులో కూలిపోయే ప్రమాదం ఉంది. కంకరవేసి రోలింగ్ చేస్తున్నప్పుడు వాటర్ చల్లడం లేదు.

– జనగాం శ్రీనివాస్, తాడికల్

నాణ్యతతో రోడ్డు వేయాలి



తాడికల్–ఏరడపల్లి డబుల్ రోడ్డు వేస్తున్నారంటే సంతోషపడ్డం. కల్వర్టులు నిర్మించారు కానీ క్యూరింగ్ చేయలేదు. రోడ్డు వేసిన తర్వాత తారు లేవకుండా రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి.

– కిష్టస్వామి, ఆటోడ్రైవర్

పనులు పూర్తి చేస్తాం

గడువులోపు తాడికల్– ఏరడపల్లి డబుల్ రోడ్డు పనులు పూర్తి చేస్తాం. పనులు అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తాం. ఎక్కడా రాజీ పడేదిలేదు.

– అమీర్‌పాషా, డీఈ

క్లుప్తంగా

బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న జగన్‌మోహన్‌గౌడ్

రామడుగు: మండల కేంద్రానికి సమీపంలో మోతె వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు సర్పంచ్ పంజాల ప్రమీల, మాజీ సర్పంచ్ పంజాల జగన్‌మోహన్‌గౌడ్, గ్రామ యువకులు వినతిపత్రం అందజేశారు. పది శాతం పనులు నిలిచిపోవడంతో నిత్యం వాహనదారులు ఇబ్బందిపడుతున్నారని, పాత బ్రిడ్జి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొందని పనులు త్వరగా పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి


సమ్మె నోటీస్ ఇస్తున్న కారోబార్‌లు

గన్నేరువరం: సమస్యలను వెంటనే పరిష్కరించాలని కారోబార్‌లు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో నర్సింహారెడ్డికి సమ్మె నోటీస్ అందజేశారు. ప్రభుత్వం అరకొర వేతనాలు అందిస్తూ కారోబార్‌లతో వెట్టి చేయించుకుంటుందన్నారు. సరిపోని వేతనంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో మాదవరావు, లక్ష్మణ్, కిషన్, అనిల్‌కుమార్, పర్శరాములు, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

సుందరగిరిలో కంటి వెలుగు శిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రమేశ్

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇప్పటివరకు 16,759 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ ధర్మానాయక్ తెలిపారు. సోమవారం సుందరగిరి గ్రామంలో సర్పంచ్ శ్రీమూర్తి రమేశ్, ఎంపీటీసీ మెడబోయిన తిరుపతితో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రామోజు రజితకృష్ణమాచారి, డాక్టర్ ప్రత్యూష, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రకళ, ఏఎన్ఎంలు జ్యోతి, సరస్వతి, స్వరూపరాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జనావాసంలోకి కొండచిలువ



గంగాధర: మండలంలోని ఆచంపల్లి గ్రామంలో కొచ్చెరువు సమీపంలో పెద్ద కొండచిలువ కనిపించింది. స్థానిక యువకులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వచ్చి తీసుకెళ్లారు. సమీప గుట్టల నుంచి కొండచిలువలు వస్తున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు.

నియామకం


నియామకపత్రం అందుకుంటున్న రమేశ్

మానకొండూర్: ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సంఘం ఖాదర్‌గూడెం గ్రామ అధ్యక్షుడిగా గాలి రమేశ్, కార్యదర్శిగా తోకల రాజు, పాలకవర్గ సభ్యులుగా రాధారాపు చక్రవర్తి, వంగ రంజిత్, గాలి సంపత్‌ను ఎన్నుకోగా గౌడ భాగ్యలక్ష్మి, సీత పద్మను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని సర్పంచ్ సాయవేని రాజు అందజేశారు.

ఘనంగా మే డే


జెండా ఆవిష్కరణలో తపాలా ఉద్యోగులు


చిగురుమామిడి: బొమ్మనపల్లిలో మే డే వేడుకలు

రామడుగు: మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం మేడేను ఘనంగా జరుపుకున్నారు. గోపాల్‌రావుపేట మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి హమాలీలకు దుస్తులు పంపిణీ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యాడ సృజన్‌కుమార్ మేడే వేడుకల్లో ఎర్ర జెండాను ఎగరవేశారు.

జమ్మికుంట: పట్టణంలో కార్మికులు వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. జమ్మికుంట హమాలీ వర్కర్స్, లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. యూనియన్ అధ్యక్షుడు ఒల్లాల శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. పట్టణంలో సీపీఎం జమ్మికుంట జోన్‌కార్యదర్శి ఎస్. అశోక్, రైస్ మిల్ ఆపరేటర్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. బజార్ ట్రాన్స్‌పోర్ట్ హమాలీ, ఫెర్టిలైజర్స్ సంఘాల ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొప్పుల శంకర్ మే డే వేడుకలకు హాజరై జెండా ఆవిష్కరించారు. కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయాలని నినదించారు. జమ్మికుంట పాత వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మే డేసందర్భంగా ప్రభుత్వం అందించిన దుస్తులను మార్కెట్ కార్యదర్శి గూగులోతు రెడ్డి నాయక్ ఆధ్వర్యంలో లైసెన్స్ హోల్డర్ హమాలీ, దడువాయి, తదితరులకు అందజేశారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కేడీసీసీ బ్యాంక్ జిల్లా వైస్ చైర్మన్ పింగిళి రమేశ్ హాజరై మాట్లాడారు. ఎందరో కార్మికుల త్యాగం ఫలితంగా మే డే దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. శ్రమ శక్తికి గురికాకుండా కార్మికుల హక్కుల కోసం కలిసి కట్టుగా పోరాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. సమాన పనికి సమాన వేతనాన్ని కార్మికుల పొందాలన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని తపాలా కార్యాలయంలో అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం హుజూరాబాద్ బ్రాంచ్ అధ్యక్షుడు ఈ.సమ్మయ్య కార్మిక జెండాను ఆవిష్కరించారు. పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో మే డే దినోత్సవం పురస్కరించుకొని ఐసీఈయూ హుజూరాబాద్ ప్రెసిడెంట్ ఆకుల చందర్ జెండా ఆవిష్కరించారు. శ్రమకు తగిన వేతనం పొందాలని కోరారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సైదాపూర్: కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు, సీపీఐ నాయకులు మేడే జెండావిష్కరించారు. మండల కేంద్రంతో వివిధ గ్రామాల్లో హమాలీ, తాపీ మేస్త్రీ సంఘాల నాయకులు జెండా ఆవిష్కరించారు.

శంకరపట్నం: మండలంలో ఊరూరా కార్మికులు మేడే వేడుకలు జరుపుకున్నారు. వివిధ గ్రామాల్లో జెండాలను ఏఐటీయూసి జిల్లా సహాయ కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఎగురవేశారు.

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా మే డే నిర్వహించారు. సీపీఐ, హమాలీ సంఘం, తాపీ భవననిర్మాణ, సీఐటీయూసీ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో గ్రామాల్లో ఎర్రజెండాలు ఎగురవేశారు.

మండల సభ వాయిదా

జమ్మికుంట: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొడ్డె మమత అధ్యక్షతన సోమవారం నిర్వహించాల్సిన మండల సర్వ సభ్య సమావేశం వాయిదా పడింది. సమావేశానికి సభ్యుల హాజరు కాకపోవడంతో సభ వాయిదా వేశామని ఎంపీడీవో కల్పన తెలిపారు. తదుపరి మండల సర్వసభ్య సమావేశం నిర్వహణ తేదీని తెలియజేస్తామని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ


గుండ్లపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న శ్రీలత

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి, గుండ్లపల్లి గ్రామాల్లో డీఆర్‌డీఏ–ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం డీఆర్‌డీవో శ్రీలత తనిఖీ చేశారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. తడిసిన ధాన్యం ఆరబెట్టిన తర్వాత కొనుగోలు చేస్తామని తెలిపారు. అలాగే హన్మాజిపల్లె, గునుకులకొండాపూర్ గ్రామాల్లోని వననర్సరీలను సందర్శించారు. హన్మాజిపల్లెలో పెద్దమ్మ గుడి నుంచి రైతుల వ్యవసాయ పొలాలకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన రోడ్డు పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో డీపీఎం ప్రవీణ్, ఎంపీడీవో స్వాతి, ఏపీఎం లావణ్య, ఈసీ రమేష్, టీఏలు, సీసీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సమ్మెకు నాయకుల సంఘీభావం


గంగాధరలో బీజేపీ నాయకుల మద్దతు


హుజూరాబాద్‌లో బీఎస్పీ నాయకులు

గంగాధర: మండల కేంద్రంలో నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు సోమవారం సంఘీబావం తెలిపారు. టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం స్థానిక నాయకులతో కలిసి వెళ్లి సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధుల్లో చేరి నాలుగేళ్లు పూర్తికావస్తున్నా ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయలేదని బీజేపీ నాయకులు విమర్శించారు.

హుజూరాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు బండారి సదానందం, రాష్ట్ర అధికార ప్రతినిధి చక్కని సంజయ్‌కుమార్‌లు అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో కార్యదర్శుల సమ్మెకు సోమవారం మద్దతు తెలిపారు. గ్రామాలాభివృద్ధిలో భాగస్వాములవుతున్న కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

తిమ్మాపూర్: ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట చేపట్టిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె నాలుగో రోజుకు చేరింది. రెగ్యులరైజ్ చేసి పేస్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, కారుణ్య నియామకం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాము, కిరణ్, ప్రణీత్, శ్రీనివాస రెడ్డి, అరుణ్, అశోక్, రాజశేఖర్ రెడ్డి, కృష్ణమోహన్, ఉపేందర్, మహేందర్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న చిన్ననాటి మిత్రులు

హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని శాలపల్లి–ఇందిరానగర్ గ్రామానికి చెందిన జూపాక విశ్వనాథ్ కరోనాతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు మిత్రులు రూ. 20 వేలు జమ చేశారు. సోమవారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

• నిత్యావసర సరుకులు అందజేత

రామడుగు: మండల కేంద్రానికి చెందిన కీర్తి కొంరయ్య–కొంరమ్మ దంపతుల కూతురు కల్యాణి వివాహానికి సోమవారం గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్ ఎండీ ఆరీఫ్ యాభై కిలోల బియ్యంతోపాటు ఎనిమిది లీటర్ల వంటనూనె, ఇతర వంట సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జట్టుపల్లి అనిల్, సంతోష్, వెంకటేశ్ పలువురు పాల్గొన్నారు.

• నూతన బీసీ హాస్టల్ నిర్మించాలి

హుజూరాబాద్‌రూరల్: నియోజకవర్గంలో నూతన బీసీ హాస్టల్ నిర్మించేలా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి చొరవ తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. హుజూరాబాద్‌లో బీసీ హాస్టల్స్ శిథిలావస్థలో ఉన్నాయని, అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం


క్రీడాసామగ్రి అందజేస్తున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో హాకీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈనెల 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో హాకీ శాశ్వత అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, క్లబ్ ప్రెసిడెంట్ కొలిపాక శ్రీనివాస్, క్లబ్ సెక్రటరీ గనిశెట్టి ఉమామహేశ్వర్, సేవ్ ది ట్రీస్ ప్రెసిడెంట్ వర్దినేని రవీందర్, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హుజూరాబాద్: పట్టణంలోని మధువని గార్డెన్‌లో విశ్వప్రగతి విద్యాలయం 1998–99 పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా అందరూ ఒకచోట చేరి యోగక్షేమాలను తెలుసుకున్నారు, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాడ రాజిరెడ్డి, కోరెం సంజీవరెడ్డి, గోపు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహారదీక్ష


నిరాహార దీక్షలో నాయకులు మధుసూదన్, తదితరులు

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మండల సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ప్రారంభమైన నిరాహార దీక్ష రెండో రోజు కొనసాగింది. గర్శకుర్తిని మండలంగా ప్రకటించాలని మూడున్నర దశాబ్దాలుగా ఉద్యమం చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, మండలం ఏర్పాటయితే 12 గ్రామాలకు అనుకూలంగా ఉంటుందన్నారు. సోమవారం నిరాహార దీక్షలో నాయకులు ఆకుల మధుసూదన్, వేముల దామోదర్, అలువాల తిరుపతి, కల్వకోట శ్రీనివాసరావు, మామిడిపల్లి అఖిల్, పొత్తూరి సురేష్, చంద్రశేఖర్, మోహన్, గణేష్, కొమురయ్య తదితరులున్నారు.

తడిసిన ధాన్యం, దెబ్బతిన్న పంటల పరిశీలన

మానకొండూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో అకాల వర్షాలకు తడిసిన ధాన్యం, దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, పరిశీలించారు. కష్టపడి పండించిన పంట, కొనుగోలు సెంటర్లలో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయిందని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు బోరున విలపించారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ జీవీ రామకష్ణారావు మాట్లాడుతూ.. రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మామిడి తోటల నష్టం అంచనా వేయాలని, ప్రతి రైతుకు నష్టపరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఊటూర్ గ్రామంలో గోపు ఆదిరెడ్డి ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎలగందుల సుదర్శన్, తుమ్మల అర్చన, కనుకుంట్ల సంగీత, ఎంపీటీసీ ముద్దసాని శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, కొట్టె రఘు, దండ బోయిన శేఖర్ పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి


పంటలను పరిశీలిస్తున్న సత్యం, తదితరులు

గంగాధర: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలపై సర్వే చేసి ఎకరాకు రూ.50 వేల పంటనష్ట పరిహారం ఇవ్వాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం డిమాండ్‌చేశారు. మండలంలోని ఉప్పరమల్యాల గ్రామంలో పంటలను సోమవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పంటలు దెబ్బతిని రైతులు గోస పడుతుంటే అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. యాభై ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా అకాల వర్షాలతో రైతులు నష్టపోయారని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముగ్గురు మంత్రులు, 11 మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు, పాలనా యంత్రాంగం ఉన్నా రైతులను పరామర్శించలేదన్నారు. గత ప్రభుత్వాలు పంటకు కొంతమేర నష్టం వాటిల్లినా పరిహారం అందించాయన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులను దోపిడీ చేస్తున్నారని, బస్తాకు రెండు కిలోలు, మిల్లులకు వెళ్లిన తరువాత మరో రెండు కిలోలు మొత్తం క్వింటాల్‌కు పది కిలోలు కోత పెడుతుండ్రని, అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించి తడిసిన ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్, దుబ్బాసి బుచ్చయ్య, జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి,దోమకొండ మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి, తోట కరుణాకర్, కోల ప్రభాకర్, లింగయ్య, మహేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలి

- మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌సిటీ: నగరంలో రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని మేయర్ సునీల్‌రావు అన్నారు. ఐదు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో నగరంలో పలు చోట్ల రోడ్లపై నీరు నిలిచి తలెత్తిన సమస్యపై సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, పీఎంసీ అధికారులతో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. కమిషనర్ సేవా ఇస్లావత్‌తో కలిసి డివిజన్ల వారీగా వర్షాలతో తలెత్తిన సమస్యలపై డీఈ, ఏఈ స్థాయి అధికారులను వివరణ కోరారు. అభివృద్ధి పనులు పూర్తి చేసిన చోట వస్తున్న సమస్యలపై అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి సలహాలు, సూచనలు చేస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. జూన్ మొదటి వారంలో వర్షాలు ప్రారంభమవుతున్నందున మే చివరిలోగా నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో పలు చోట్ల ఇబ్బందులు తలెత్తాయని తెలిపారు. వాటిని పరిగణలోకి తీసుకొని వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అన్నారు.

ఆధ్యాత్మికం

నేత్రపర్వంగా సీతారామచంద్రస్వామి కల్యాణం


పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

శంకరపట్నం: మండలంలోని ముత్తారం సీతారామచంద్రస్వామి కల్యాణం సోమవారం రాత్రి అర్చకులు నేత్రపర్వంగా జరిపించారు. స్వామివారికి ప్రభుత్వం తరఫున మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యేకు అర్చకులు రాఘవాచార్యులు, శేషాచార్యులు బాలాజీచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ రేణుక, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, ఏరడపల్లి సర్పంచ్ రంజిత్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

మానసాదేవి ఆలయంలో కుంకుమార్చన


మానసాదేవి ఆలయంలో కుంకుమార్చనలో భక్తులు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామం శ్రీమానసాదేవి ఆలయ పంచమ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం కుంకుమార్చన కార్యక్రమం ఆలయ ప్రధాన అర్చకులు మామిడాల నాగసాయిశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అన్నదానంకు క్లెం శోభనిరంజన్‌రెడ్డి యాభై కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.